అలంకారప్రాయమే..




కంచరపాలెం కూడలిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్


వేగానికి కళ్లెం లేకపోవడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టిన కారు (ఫైల్)


ఐటీఐ జంక్షన్‌లో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్


ఊర్వశి కూడలిలో..


ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారిలో ఇలా..

కంచరపాలెం: కంచరపాలెం పరిధి బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పని చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ జంక్షన్, 104 ఏరియా కూడలి, మర్రిపాలేనికి వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా మారాయి. దీంతో కూడళ్లలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో పసుపు రంగు స్తంభాలతో ట్రాఫిక్ సిగ్నల్‌లైట్లు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అవి తుప్పుపట్టి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నీలం రంగులో ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు పాత వాటి పక్కనే ఏర్పాటు చేశారు. ఏళ్ల గడుస్తున్నా వాటిని అలంకారప్రాయంగా ఉంచారే తప్ప వినియోగంలోకి తీసుకురాలేదని పలువురు విమర్శిస్తున్నారు. నిధులు వినియోగించినా వాటిని ఉపయోగంలోకి తీసుకురాకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ కూడళ్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో రోడ్డు దాటాలంటేనే ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి, అమర్చిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

ఇష్టానుసారం రాకపోకలు

బీఆర్‌టీఎస్ రహదారుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ ప్రయాణం చేయాల్సివస్తోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ వినియోగంలోకి తేవాలి.

– కాంద్రేగుల వెంకటరావు, వాహనచోదకుడు, జ్ఞానాపురం

ప్రమాదాలు జరుగుతున్నాయి

బీఆర్‌టీఎస్ రహదారిలో జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయక నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాల వేగ నియంత్రణకు కళ్లెం లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. సిగ్నల్స్ పునరుద్ధరించి, ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే తప్ప ప్రమాదాలకు చెక్ పెట్టలేం.

– స్వరాజ్యలక్ష్మి, భవాని గార్డెన్స్, ఐటీఐ జంక్షన్

సిబ్బందిని ఏర్పాటు చేయాలి

సిగ్నల్స్ ఏర్పాటు చేసినా బీఆర్‌టీఎస్ కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలి. సిబ్బంది లేకపోవడం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలి.

– పి.అప్పలరాజు, పాదచారుడు, కంచరపాలెం

ఎన్‌ఎంఎంఎస్‌కు ఉర్దూ పాఠశాల విద్యార్థుల ఎంపిక


ఎస్.ఉమామహేష్


పీసా యశ్వంత్


ఎస్‌కె.తస్నీం

సీతంపేట: జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్–ఎన్‌ఎంఎంఎస్) 2024–25 కు ముస్లింతాటిచెట్లపాలెం జీవీఎంసీ ఉర్దూ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న ఎస్.కె.తస్నీం, పీసా యశ్వంత్, నల్లా ఉమా మహేష్ ఈ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు 4 సంవత్సరాలు, ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి అందిస్తారని పాఠశాల ఉపాధ్యాయిని శాంతికుమారి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

వృద్ధురాలికి ఆశ్రయం

మురళీనగర్: నిరాదరణకు గురవుతున్న వృద్ధులను చేరదీసి, సేవలు అందిస్తున్న వానప్రస్థ వృద్ధాశ్రమం నిర్వాహకులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలిని మంగళవారం చేర్చుకుని ఔదార్యం చాటారు. సుమారు 80 సంవత్సరాల వృద్ధురాలు దీర్ఘ కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ 33వ వార్డు కార్పొరేటర్ భర్త ఇచ్చిన సమాచారం మేరకు తెలుసుకున్న వానప్రస్థ వృద్ధాశ్రమం మేనేజింగ్ డైరెక్టర్ రొబ్బి శ్రీను, ఆశ్రమ నిర్వహణ బృందంతో ఆమె వద్దకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వృద్ధురాలి అంగీకారం మేరకు ఆశ్రమంలో చేర్పించినట్లు నిర్వాహకుడు రొబ్బి శ్రీను తెలిపారు. ఆమెకు వైద్య సౌకర్యం అందించి, సపర్యలు చేశారు.

క్లుప్తంగా

గణపతిరాజుకు ఘన నివాళి


గణపతిరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు స్మారక సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గణపతిరాజు అచ్యుతరామరాజు 21వ వర్ధంతి స్మారక సభ నిర్వహించారు. సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, విశాఖ సాహితి అధ్యక్షుడు కోలవెన్ను మలయవాసిని, ప్రముఖ రచయితలు డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, భళ్ళమూడి రామమూర్తి, మల్లా ప్రగడ రామారావు, దూసి శ్రీరామమూర్తి, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొని గణపతిరాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కళా, సాహిత్య, సాంస్కృతిక నాటక రంగాలలో గణపతిరాజు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పెన్మత్స లలితా వాశిష్ట, ప్రధాన కార్యదర్శి పెన్మత్స జగన్నాథరాజు పాల్గొన్నారు.

పల్లాకు మంత్రి లోకేష్ పరామర్శ


పల్లా సింహాచలం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మంత్రి లోకేష్, తదితరులు

సీతంపేట: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం చిత్ర పటానికి మంత్రి నారా లోకేష్ మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతంపేటలో నివాసం ఉంటున్న పల్లా శ్రీనివాసరావును, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఆయన మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ శ్రీభరత్, హోంమంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'లోకేష్.. హిందువుల ఆచారాలు తెలియవా?'


బీవీ రామ్

ఎంవీపీ కాలనీ: మంత్రి నారా లోకేష్ హిందువుల ఆచారాలను మంటగలిపారని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ఆరోపించారు. మంగళవారం పాత వెంకోజిపాలెంలోని శివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రోజు మృతుల కుటుంబ సభ్యుల పరామర్శకు వెళ్లకూడదనే ఆచారం హిందు సంప్రదాయంలో ఉందన్నారు. దాన్ని తుంగలోకి తొక్కి ఇటీవల మరణించిన పల్లా సింహాచలం ఇంటికి లోకేష్ పరామర్శకు వెళ్లడం దారుణమన్నారు.

వాని-2025 కోఆర్డినేటర్‌గా నారాయణరావు



మురళీనగర్: ఏఐసీటీఈ అత్యంత ప్రతిష్టాత్మకంగా జాతీయ స్థాయిలో నిర్వహించే వైబ్రంట్ అడ్వకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజీ (వాని–2025) కార్యక్రమం నిర్వహణ సమన్వయకర్తగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి రెండు రోజుల పాటు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి సింపోజియంకు ఆయనతో పాటు సహ కో–ఆర్డినేటరుగా సీనియర్ లెక్చరర్ డాక్టర్ రాజు చిట్ల వ్యవహరించనున్నారు. ఈ సింపోజియంలో డిజిటల్ మేకోవర్ ఇన్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్, టెక్నాలజీ అండ్ సస్టైనబిలిటీ అనే అంశంపై చర్చించనున్నారు.

రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర మైనార్టీ వింగ్ అధ్యక్షుడిగా వరప్రసాద్



కంచరపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ వింగ్ అధ్యక్షుడిగా విశాఖ జిల్లాకు చెందిన డాక్టర్ మాముడురీ వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిట్ట ప్రసాద్ నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. తనకు రాష్ట్ర మైనార్టీ వింగ్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకులకు వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

15 మంది వెళ్లారు... 20 మంది వచ్చారు!

- మాధవధార జీవీఎంసీ హైస్కూల్లో ఉపాధ్యాయుల చేరిక


మాధవధార హైస్కూల్ హెచ్‌ఎం హేమలతకు బదిలీ పత్రాలు అందిస్తున్న కొత్త ఉపాధ్యాయులు

మురళీనగర్: ఉపాధ్యాయల బదిలీల్లో భాగంగా మున్సిపల్ పాఠశాలల్లో దీర్ఘ కాలంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వీరిలో సింహ భాగం ఉపాధ్యాయులు 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఒకే చోట పని చేస్తూ కొత్త పాఠశాలకు వచ్చారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి 15 మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలకు బదిలీపై వెళ్లగా.. 20 మంది ఉపాధ్యాయులు బదిలీపై ఇక్కడికి వచ్చారు. పీడీ పోస్టులు అదనంగా రెండు పెరిగాయి. వారు కూడా వస్తే ఇక్కడికి 22 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లవుతుంది. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ముగ్గురు తెలుగు టీచర్లలో ఇద్దరు కె.కాలనీ ఉన్నత పాఠశాల, ఒకరు న్యూకాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు, 3 హిందీ పోస్టుల్లో ఒకరు కె.కాలనీ, ఇద్దరు కప్పరాడ, 3 గణితంలో ఇద్దరు ఆర్‌పీపేట, ఒకరు దాబాగార్డెన్స్‌లోని ఎంజీఎం హైస్కూల్, 3 పీఎస్ టీచర్లలో ఇద్దరు కప్పరాడ, ఒకరు ఆర్‌పీపేట, ఒక బయలాజికల్ సైన్సు టీచర్ ఆర్‌పీపేటకు, ఒక సోషల్ టీచర్ ఆర్‌పీపేటకు, ఒక ఫిజికల్ డైరెక్టర్ కప్పరాడ పాఠశాలకు బదిలీ అయ్యారు. తెలుగు 4, హిందీ 3, ఇంగ్లిష్ 1, గణితం 5, పీఎస్ 2, ఎన్ఎస్ 3, సోషల్ 2 పోస్టులు బదిలీపై వచ్చారు. పాత టీచర్లు ఐదుగురే మిగిలారు. మిగతా అందరూ కొత్తవారే కావడం గమనార్హం.

పెరిగిన పోస్టులు

ప్రస్తుతం ఈ పాఠశాలలో 6–10 వరకు 776 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొత్తగా విద్యార్థులు చేరుతున్నారు. 49 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇవ్వడం వల్ల పోస్టులు పెరిగాయి. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు పాఠశాలలో చేరినట్లు హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. పోస్టులు పెరగడంతో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తామని చెప్పారు.

లైంగికదాడి నిందితులను ఉరి తీయాలి


కంచరపాలెం దళిత సేన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: అతి కిరాతకంగా దళిత బాలికపై కామాంధులు చేసిన అత్యాచారంపై నిందితులను అందర్నీ ఉరితీయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. ఈ సంఘటనను నిరసిస్తూ కంచరపాలెం దళిత సేన కార్యాలయంలో మంగళవారం నిరసన చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లిలో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం కేసులో కేవలం ఆరుగురు నిందితులను మాత్రమే పోలీసులు అరెస్టు చేశారన్నారు. పరారైన మిగిలిన నిందితులను వెంటనే అరెస్టు చేసి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి నీచులకు సమాజంలో జీవించే హక్కు లేదన్నారు. సుమారు 14 మంది నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడుతూ తల్లి కూతుర్లను బెదిరించి, వీడియోలు తీసి దారుణానికి ఒడిగట్టారని, వారిలో రౌడీ షీటర్లు ఉన్నా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల నిర్లక్ష్యం మరింత పెరుగుతోందన్నారు. ధర్మవరం పోలీసులు దళిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన సిటీ కన్వీనర్ గొల్లమాల మీనా, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జున్, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుని సన్నిధిలో పౌర్ణమి వేడుకలు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పూర్ణిమ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు అనంతరం పుష్పాంజలి సమర్పిస్తామన్నారు. మల్లెలు, గులాబీలు, జాజులు, లిల్లీ, సంపంగి, చామంతులు, తులసీ, బిల్వ, ధవనం, మరువం తదితర పత్రాలు సమర్పించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా 108 కలశాలతో స్వామికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు రూ.500 చెల్లించి గోత్రనామాలతో అభిషేక సేవలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూజా సామగ్రిని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేస్తారన్నారు. ఉదయం 7 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం, అష్టోత్తర శత రజత కలశ గంధోదక అభిషేకం, పుష్పాంజలి నిర్వహిస్తామన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులు యోగాంధ్రలో పాల్గొనాలి

మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్

డాబాగార్డెన్స్: విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పిలుపునిచ్చారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి నేతృత్వంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర జిల్లా స్పెషల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, ఇతర ప్రజా ప్రతినిధులు, విశాఖ ప్రజలందరితో చేపట్టనున్న కార్యక్రమం విశాఖ చరిత్రలో నిలిచిపోనుందన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న యోగా ప్రక్రియ ప్రపంచానికి పరిచయం చేసి 10 ఏళ్ల పూర్తయిన సందర్భంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఒకే చోట 5 లక్షల మంది ప్రజలు కూర్చుని యోగా నిర్వహించి గిన్నీస్, ప్రపంచ రికార్డు నెలకొల్పి ప్రపంచానికి మన రాష్ట్ర శక్తి, విశాఖ కీర్తిని చాటాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ సిబ్బంది, మెప్మా, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, సంఘ నాయకులు చక్కటి సమన్వయంతో ప్రజలందరినీ వేదిక వద్దకు సమీకరించి, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ కె. దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డి.మార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.11,500 వేతనం ఉంటుంది.ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతోపాటు 50 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ. 16,000 వేతనం ఇవ్వనున్నారు.

అలరించిన శ్రీరామ చరితం పంచాదశ రాగమాలిక


రామ చరితం కీర్తనలు అలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట: సెంటర్ ఫర్ సైకాలజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ మ్యూజిక్ థెరపీ సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం శ్రీరామ చరితం పంచాదశ రాగమాలిక కార్యక్రమం నిర్వహించారు. వీజీఆర్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు పంచజాతి ధృవతల కృతులు ఆలపించి ఆలరించారు. అనంతరం కె.గాయత్రి వరేణ్య పాడిన కీర్తనలు మంత్రముగ్ధులను చేశాయి. ఎ.వి.ఆదిత్య వయోలిన్‌పై, పీవీఎస్ బాలాజీ యువరాజ్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో మ్యూజిక్, సైకాలజీకి సంబంధించిన రెండు కోర్సులను ప్రారంభించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమరవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలివి... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్‌మారూఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కోరాపుట్ నుంచి బెంగళూరుకు విశాఖపట్నం మీదుగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అనిత్‌టాగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.16,500 విలువైన 3.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది జీతాల నిర్వహణపై ఎస్‌బీఐతో ఒప్పందం

ఉక్కునగరం: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది జీతాల ఖాతాలను నిర్వహించేందుకు సీఐఎస్ఎఫ్‌తో ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పదవీ విరమణ పొందిన సిబ్బంది ఖాతాలను మూడేళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం జరిగింది. ఈ మేరకు సీఐఎస్ఎఫ్ తరఫున అడ్మినిస్ట్రేషన్ డీఐజీ రేఖ నంబియార్, ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ జీఎం రంజన్ సిన్హాలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిబ్బందికి మెరుగైన ఆర్థిక ప్రయోజనాలను సమకూర్చడంతో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు దోహదపడతాయని స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ వర్గాలు తెలిపాయి. జీరో అక్కౌంట్ ఇవ్వడంతో పాటు రూ. 50 లక్షలు ప్రమాద బీమా (మరణ) కవరేజీ ఉంటుంది. వార్షిక నిర్వహణ చార్జీలు లేకుండా ఉచిత డెబిట్ కార్డు, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు, ఇతర బ్యాంక్ ఏటీఎంలలో నెలకు 10 ఉచిత లావాదేవీలు, హర్షక లాకర్‌పై 10 శాతం రాయితీ ఉంటాయి. ఉచిత డిమాండ్ డ్రాఫ్ట్‌ల జారీ ఉంటుంది. తద్వారా సిబ్బంది భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు, తోబుట్టువులు నాలుగు జీరో ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించారు. ఈ ప్రయోజనాలపై సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించేందుకు ఎస్‌బీఐ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా కనకమాంబ పండగ


ఆకట్టుకున్న కోయ డ్యాన్సు


బల్ల వేషాలు


నేల డ్యాన్సు


మహిళల కోలాటం

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ కనులపండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట, గొల్లవీధి, నాయుడువీధి, కనకమ్మవీధి, శ్రీనివాసవీధి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు, మొక్కుబడులు సమర్పించారు. సాయంత్రం నాయుడు వీధిలోని పుట్టబంగారం ఘటాలతో అమ్మవారి అనుపు ఉత్సవ ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులు, టెంకాయలతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేల డ్యాన్సులు, తప్పెటగుళ్లు, కోలాటం, సేవ గరిడీలు, బల్ల వేషాలు, ధూంధాం డ్యాన్సు, పులివేషాలు వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతంపేట కూడలిలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

బాలికలకు కౌమార దశపై అవగాహన అవసరం


53వ వార్డులోని నరేంద్రనగర్‌లో బహుమతులు అందుకున్న బాలికలతో అంగన్‌వాడీ సిబ్బంది

మర్రిపాలెం: కిశోర బాలిక కౌమార దశపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. ఈ మేరకు 53వ వార్డు నరేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అర్బన్ సీడీపీవో రమణ కుమారి పర్యవేక్షణలో నిర్వహించిన కిశోర వికాస వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో జ్యోతి మాట్లాడారు. కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలను నిర్ధారించుకోవడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కౌమార బాలికలను సాధికారపరచడం, రక్తహీనత సమస్యను అధిగమించేలా చేసి చదువులో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిశోర టీం కన్వీనర్(మహిళా సంరక్షణ కార్యదర్శి) స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పెద్ద సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.

రామాలయం సందర్శన


పౌర్ణమి వేడుకల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

మురళీనగర్: స్థానిక రామాలయాన్ని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం సందర్శించారు. గురుపౌర్ణమి వేడుకలు సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయన ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో షిర్డీసాయి మందిరంలో నిర్వహించే సాయినాథుడి ఏకాహం సంబంధించిన కరపత్రాలు ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.